# వర్చ్యుయల్ రియాలిటీ



"సుప్రియా!"

"ఊఁ!"

"నిద్ర రావటం లేదా?"

"లేదు. ఈ ఉరుములు, మెరుపుల మధ్య నిద్ర పట్టటం లేదు. మనస్సంతా కూడా ఏదో మబ్బు కమ్మినట్టుంది మనీషా!"

"నాకూ అంతే. అయామ్ డిస్టర్బ్‌డ్. ఒకే హాస్టల్లో, ఒకే గదిలో ఉంటూ కూడా మనమెప్పుడూ మనసు విప్పి మాట్లాడుకోలేదు గదూ! విచిత్రం. అయినా అంత సమయం ఎక్కడుంటుంది? తెల్లారి లేస్తే ఎవరి కంపెనీ పరుగు వాళ్లది. 'సత్యం'లో నువ్వు, అసత్యంలో

నేను! ఎందుకో ఈ అర్ధరాత్రి నీకు నా అశాంతి గురించి చెప్పాలనిపిస్తుంది."

"నాకూ అలాగే వుంది. కాసేపు మేడపైకి వెళ్దామా?"

"అలాగే."

"ఈ చల్లగాలి, ఈ తుంపర చినుకులు - ఎంత హాయిగా వుంది!"

"ఇన్ని అంతస్థులపైన ఈ చీకట్లో మెరుపుల్లో పిట్టగోడ దగ్గర నిలబడి సిటీ అంతా చూస్తుంటే నీకేమనిపిస్తుందే?"

"ఎప్పుడో చదివిన కవిత ఒకటి గుర్తొస్తుంది.

'రాత్రి
అద్భుత భయానక రాత్రి
లోపలికన్ను తెరుచుకునే రహస్యద్వారం రాత్రి
నులివెచ్చని కోర్కెల మలుపుల్లోకి నిన్ను మంత్రించి మంత్రించి
బావ్ మంటుంది రాత్రి
ఈ రాత్రి నీకూ నాకూ మధ్య
ఏరులా ప్రవహిస్తోంది'

"చాలా సున్నితంగా ఉంది కదూ! నీకు కవిత్వమంటే యిష్టమా?"

"ఇంకా చాలా చాలా యిష్టం. మరి యీ సమయంలో నీకేమన్పిస్తుందే?"

"చెప్పనా? చుట్టూ చీకట్లో ఏదో ఉంది. తెలీనిదేదైనా సరే పొందాలనివుంటుంది నాకు. ఈ పిట్టగోడ పైనుంచి చీకట్లోకి దూకి, ఈదుతుంటే ఆ అనుభూతి ఎలా వుంటుందా అని."

"నా కర్థం గావటం లేదు."

"ఏది నేను కాంక్షిస్తానో, కాంక్షించాలో తెలీటం లేదు. ఈ సాఫ్ట్వేర్ జాబ్‌లో ఏముందో చూద్దామని ఎక్కడో నార్త్ ఇండియానుంచి - నోయిడా నీకు తెలుసుగా - ఇక్కడికొచ్చాను. కాని మంచి శాలరీ తప్ప ఏముందిక్కడ?"

"నీ వర్క్‌లో నీకు తృప్తి లేదా మనీషా?"

"ఏముందిందులో? పైగా నాకంత వర్క్ కల్చర్ లేదు. ఈ ఫీల్డే గమ్మత్తైంది గదా? సాఫ్ట్వేరిజమ్ జోక్స్ నీకు తెలుసుగా? లేటెస్ట్, ఒకటి చెపుతా, విను.

అనగనగా ఒక క్లయింట్‌కి రెండు ఆవులు. వాటి పాలెట్లా పితకాలో నువ్వు చెప్పాలి. ఎప్పుడు, ఎన్నాళ్లపాటు పితకాలో ప్రాజెక్ట్ ప్లాన్ తయారు చేస్తావు. ఎలా పితకాలో డిజైన్ చేస్తావు. తర్వాత రెండు డమ్మీ ఆవుల్ని తయారు చేసి, పాలెట్లా తియ్యాలో క్లయింట్‌కి చూపిస్తావు. (అతను శాటిస్‌ఫై కాకపోతే మళ్లీ మొదలెత్తుకోవాలనుకో.) చిన్నా పెద్దా సమస్యలధిగమించి,

పాలు తీసి, ఆన్ సైట్‌కి పంపిస్తావు. అక్కడ పాలు రావటం లేదని ఆన్ సైట్ రిపోర్ట్ చేస్తుంది. నువ్వు తల బద్దలు గొట్టుకుంటావు. చివరికి ఆన్ సైట్ ఆవులనుంచి గాక ఎద్దులనుంచి పాలు ట్రై చేస్తున్నట్టు గ్రహిస్తావు. మొత్తానికి ఆన్ సైట్ పాలు తీసి, క్లయింట్ కిస్తుంది. మిల్క్ క్వాలిటీ బాగోలేదంటాడు క్లయింట్. ఆఫ్ సైట్ చచ్చి చెడి, దాని క్వాలిటీ పెంచుతుంది. ఈసారి మిల్కింగ్ స్లో రేట్‌లో ఉందంటాడు క్లయింట్. నువ్వు మళ్లీ తల బద్దలుగొట్టుకొని, దాని పెర్ఫార్మెన్స్ పెంచుతావు. ఆపాటికి ఆవులు రెండూ వయసుడిగి వట్టిపోతాయి! కత కంచికి. మనమింటికి."

"నువ్వు చెపుతుంటే బలే సరదాగా ఉంది."

"అవునా? ఒకప్పుడు నువ్వు చెప్పిన చీమ కథ మాదిరే. మొదట్లో ఇందులో ఏముందో ఆసక్తిగా చూశాను. ఏమీ లేదు. ఇప్పుడు వీకెండ్స్ పార్టీల్లో, పబ్స్‌లో ఏముందో చూస్తున్నాను. బాయ్ ఫ్రెండ్స్‌లో ఏముందో చూస్తున్నాను. ఇవాళ మా టీం మెంబర్, న్యూ బాయ్ ఫ్రెండ్, 'ఐ లవ్ యూ' అని, మేరేజ్ ప్రపోజల్ ముందు పెట్టాడు. 'నో' అన్నాను. ఎంత డిజప్పాయింట్ అయ్యాడో? బట్ ఐ కాంట్ హెల్ప్. నాకేం కావాలో నాకే అర్థం గాదు. అర్థమైంది అక్కర్లేదు. నీకు తెలుసుగా? మమ్మీ, డాడీ నాకోసం రారు. నా లైఫ్‌తో వాళ్లకి సంబంధం లేదు. వాళ్లతో నాకు నిజమైన సంబంధం లేదు. ఎప్పుడో తెగిపోయిన దారాలవి."

"ఎందుకని? ఒకే కుటుంబంలో ఒకళ్లంటే ఒకళ్లకి ప్రేమలు లేకుండానా?"

"అవును. అవేమో తెలీకుండానే పెరిగాను. మై డాడ్ అండ్ మమ్. దే హేట్ ఈచ్ అదర్ లైక్ ఎనీ థింగ్. ఒకేచోట ఉంటూ, ఒకే మంచం మీద పడుకుంటూ అంతలా ద్వేషించుకోవటం ఎలా సాధ్యమో నాకు తెలీదు. డాడీ ఇంటి బాధ్యత పట్టించుకోకుండా ఎక్కడెక్కడో తిరిగొస్తుంటాడని మమ్మీ ఆరోపణ. మమ్మీ మీద డాడీకి అనుమానం. అప్పుడప్పుడూ కొడతాడు. మమ్మీ తిరగబడుతుంది. ఇద్దరి పోట్లాటలు నేను గమనిస్తున్న సంగతి వాళ్లు గమనించారు. నన్ను దూరంగా హాస్టల్‌లో పడేశారు. ఒక్కతే కూతుర్ని గదా? అయినా దగ్గిరగా ఉంచుకోవాలనుకోలేదు. ఇప్పటికీ, బహుశా ఎప్పటికీ వాళ్లకి నేను దూరమే. ఈ ఫ్యామిలీ సిస్టం మీదనే నాకు నమ్మకం సడలింది. ఇక ఏ వాల్యూస్‌ని ప్రేమించాలో అర్థంగాదు.

వారాంతానికి అలిసిపోతాను. పని ఒత్తిడినుంచి విడుదల కావాలి. ఈ దరిద్రపు హాస్టల్ తిండి. బయటికెళ్లాలి. ఎంజాయ్ చెయ్యాలి. ఔటింగ్స్. పబ్స్. ఫ్రెండ్స్‌తో డాన్స్. వీటన్నిటి మధ్య ఏదో కసి తీరినట్టుంటుంది. కానీ ఎవరి మీద? దొరికిందేదీ తృప్తినివ్వదు. ఏ ఖాళీ నిండుకోదు. ఎంప్టీనెస్ సిండ్రోమ్. ఇంకేదో కావాలన్పిస్తుంది. అదేమిటో తెలీదు. అయామ్ బర్నింగ్."

"సారీ మనీషా! నీలో ఇంత డిస్టర్బెన్స్ ఉంటుందనుకోలేదు."

"పోనీలే. మరి సుప్రియా! నీ అశాంతికి కారణమేంటి?"

"కోరుకోవాల్సిందేదో నాకు తెలుసనే అనుకుంటాను. కాని కోరుకున్నది దక్కక పోవటమే గదా అశాంతికి మూలం? అదే నా సమస్య. ఈ ప్రపంచంలో నాదైనదే నాది. నాది కానిదేదీ నాది కావాలని కోరుకోను. అదే అపరిగ్రహం అని ఎక్కడో చదివాను."

"అంటే?"

"ప్రకృతి నుంచి లేదా ఇతరులనుంచి నీకు చెందనిదేదీ (అతిగా) నువ్వు గ్రహించకపోవటం."

"నా కర్థం గాలేదు."

"పోనీ, నాకర్థమైంది చెపుతాను. నేను కాలేజీలో చదువుతున్నప్పుడు సైకిల్ మీద వెళ్లేదాన్ని. రెండు కిలోమీటర్ల దూరం. నాన్న టూ వీలర్ కొనిపెడతానన్నా వద్దన్నాను. సైకిల్ తొక్కటంలో నా ప్రమేయం, నా శక్తి, ఆసక్తి ఉంటాయి. టూ వీలర్‌లో అవి ఉండవు. సరే ఒక సాయంత్రం కాలేజీ వదిలింతర్వాత విష్ణునగర్ రెండో లైన్లో వస్తుండగా ముందు చక్రం గాలి తగ్గిందేమో అన్పించింది. చక్రం వంక వంగి పరీక్షగా చూస్తుంటే నేలమీద ఒక వస్తువు మెరుస్తూ కన్పించింది. ఎవరిదో బంగారపు గొలుసు. దగ్గరగా చూస్తే చిన్నపిల్లల గొలుసులాగా అన్పించింది. పక్కన గ్రౌండ్‌లో స్కూలు పిల్లలెవరో ఆడుకుంటున్నారు. ఎప్పటినుంచో నా మెడలో గొలుసు లేని లోటు ఆ సందర్భంలో తీరిపోయిందనే సంతోషం కలిగింది. కాని నువ్వు నమ్ముతావో నమ్మవో ఆ వస్తువును తీసుకోటానికి నా చేతులు రాలేదు."

"ఎందుకని?"

"ఆ వస్తువు నాది కాదు కనుక. ఒక వేళ అది నేను తెచ్చుకుంటే నాకెంత సంతోషం కలుగుతుందనుకున్నానో అంత బాధ దాన్ని కోల్పోయిన వాళ్లకి కలిగిస్తాను కదా! అందుకే దాన్ని అక్కడే వదిలెయ్యదలుచుకున్నాను."

"ఎంత చాదస్తమే నీది? దొరికిన సొమ్ము దొంగతనమా? అయినా నువ్వు వదిలేస్తే యింకెవరన్నా తీసుకోవచ్చు గదా?"

"అందుకే దాన్ని భద్రంగా పక్కనే వున్న స్కూల్ హెడ్ మిస్ట్రెస్‌కి అప్పజెప్పాను. అది ఆ పోగొట్టుకున్న పిల్లకి దక్కినప్పుడు దాని కళ్లలో వెలిగిన సంతోషం చూసి నాకెంతో సంతోషం కలిగింది. నువ్వన్నట్లు నా చాదస్తానికి ఇంట్లో అమ్మ విసుక్కుంటే నాన్న 'నువ్వు నా కూతురివి గదా!' అని నన్ను అమాంతంగా హృదయానికి హత్తుకున్నాడు. ఐ లవ్ మై డాడీ. లక్షరూపాయల కట్ట తనకి దొరికినప్పుడు దాన్ని అసలు వ్యక్తికి చేర్చేదాక నాన్న నిద్రపోలేదనే సంగతి నాకు తెలుసు."

"మొత్తానికి భలే కుటుంబమే మీది."

"అయితే ఇది కాదు నా సమస్య. నాది అనుకున్నది నాకు దక్కకపోవటమే ఇప్పటి నా విచారానికి కారణం."

"అదేమిటి?"

"స్ట్రెస్ అండ్ టెన్షన్. ఇదే గదా కెరీర్ అంతా? ఈ ఉద్యోగంలో చేరిన తర్వాత అమ్మా నాన్నల దగ్గిర హాయిగా నాలుగు రోజులుందామన్నా సెలవు దొరకటం లేదు. నా సంగీతం, పెయింటింగ్ - అన్నీ ఏమై పొయ్యాయో? సంజీవదేవ్ నా బొమ్మలు చాలా మెచ్చుకొనేవారు.

ఒక సంగతి చెప్పనా? ఒకప్పుడు కాలేజీ టూర్‌లో అజంతా గుహలు చూసి పరవశించిపొయ్యాను. గుర్రం గిట్టల్లా ఉండే ఆ కొండల్లో, వాఘీరా నది పక్కన, ఆ 30 కొండ గుహలు - అదొక అద్భుత లోకం గదా? ఒకప్పుడు త్రిశరణాలు మార్మోగిన లోకం. నాకెందుకో ఇప్పటికీ మళ్లీ మళ్లీ గుర్తుకొస్తుంది. ఆ ప్రదేశంలో నాకు రెక్కలొచ్చాయి. ఆ గుహల్లో రెక్కల్తో ఎగురుతూ నేనా కళనాస్వాదించాను. ఆ చిత్రాల సౌందర్యమంతా వాటి కళ్లలోనే వుంది.

*'గుహల గోడలంతటా కరుణలో తడిసిన కళ్లు*
*అణువణువునా దయా నయన పారావతాలు*
*కాలాన్ని ఈది వచ్చిన*
*అగాథ మార్మిక ప్రశాంత నేత్రాలు*
*లోకం చీకటి సగాన్ని*
*అర్ధ నిమీలితం చేసిన కళ్లు'*

అన్నాడు కవి. సిద్దార్థ జననం, మహాబోధి, మహాపరినిర్వాణం, యశోధర వేదన, పద్మపాణి - ఆ చిత్రాల్లోని ప్రపంచం నిజంగా అక్కడ లేదు. కాని నేనందులో ఉన్నాను. మాయాదేవి ఒడిలో నేనున్నాను. బుద్ధుడి భిక్షాపాత్రలో ఉన్నాను. ఆ తొలి గుహలో బోధిసత్వుడి చేతిలో పద్మం నేనే. అందులోని అలౌకిక పరిమళం నేనే. అది అవాస్తవంలో అద్భుత వాస్తవం. ఎక్కడ గొప్ప అనుభూతి ఉందో అక్కడే మనం నిజంగా జీవించినట్టు గదా?"

"నిజమే. నీ అనుభూతుల్లో నేను కూడా లీనమైపోతున్నట్టుందే."

"కాలేజీ రోజుల్లో ఏ ఎంకి పాటలో, అన్నమయ్య కృతులో పాడుతుంటే ఎంత ఆనందం కలిగేది? ఎన్ని బహుమతులు! ఇప్పుడు క్యూబికల్‌లో కూర్చుని ఏం పాడతాం? బ్రహ్మమొక్కటే అన్నట్టు కంప్యూటర్ ఒక్కటే మనకి సర్వస్వం. ఈ ప్రాజెక్టులో నా కష్టం చెపితే తీరేది కాదు. సరైన లీడర్‌షిప్ లేదు. అంతా ఒక టన్నెల్ విజన్. ప్రోడక్ట్‌ని అన్ని ఎన్విరాన్‌మెంట్స్‌లో సరిగ్గా టెస్ట్ చెయ్యలేదు. కోడ్ రివ్యూ సరిగ్గా చెయ్యలేదు. తీరా ప్రొడక్షన్ సమయంలో 25 మంది యూజర్స్ లాగిన్ కాగానే సిస్టం హాంగ్ అయ్యింది. ఎ మిజరబుల్ ఫెయిల్యూర్. అటువైపు క్లయింట్స్ తొందర.

మూడు రోజుల్లో అంతా సెట్ చేస్తానని వాళ్లకి చెప్పాడు మేనేజర్. ఇక్కడ ఒక పెద్ద మీటింగ్ పెట్టాడు, గంటల తరబడి. కాని ఏం ప్రోగ్రెస్ లేదు. టీం మొత్తం విసుగు. నిరుత్సాహం. ఇక ఆ బరువంతా టాప్ ప్రోగ్రామర్‌గా నా నెత్తిమీద పెట్టాడు మా పి.ఎల్. రెండు రోజులు డెడ్ లైన్. అది నా తెలివితేటలకి ఛాలెంజ్‌గా తీసుకున్నాను. గంటలు గంటలు తల బద్దలు కొట్టుకున్నాక ఏం చెయ్యాలో ఒక దారి దొరికింది."

"అదెట్లా?"

" ఇట్సాల్ ఎ డిఫరెంట్ విజన్. డిజైన్ మొత్తం రివైజ్ చేశాను. రాత్రింబగళ్లు కూర్చుని, మళ్లీ మళ్లీ కోడ్ డిగ్ చేస్తే బ్లండర్ బయటపడింది. అందులో ఒక సెషన్ సరిగ్గా క్లోజ్ చెయ్యలేదు. అదీ కారణం. ఇంత పనిలో పి.ఎల్. నాకు హెల్ప్ చేసింది తక్కువ. మూడు రోజుల్లోనే ప్రాజెక్ట్ ఫ్లో మళ్లీ రెడీ అయింది."

"వండర్‌ఫుల్ సుప్రియా! యువార్ గ్రేట్."

"నేను చేసిన పని నాకెంతో సంతృప్తినిచ్చింది. కాబట్టి ఇటువంటి ఒక మంచి మాటే నేను కోరుకున్నాను. అంతకు మించి ఏమీ లేదు. పి.ఎల్. కూడా పైకి ఇదే మాటన్నాడు. కానీ ఆ తర్వాత జరిగింది వండర్."

"అదేమిటి?"

"ప్రాజెక్ట్ మేనేజర్ దగ్గర ఆ ఘనత మొత్తం తనదిగా ప్రాజెక్ట్ చేసుకున్నాడు మా పి.ఎల్. ఈ మధ్య జరిగిన అప్రయిజల్‌లో మా మేనేజర్ దీక్షిత్‌ని - అదే మా పి.ఎల్.ని - ఆకాశానికెత్తేశాడు. అతని వర్క్ అద్భుతం అన్నాడు. అందులో నా ఇన్వాల్వ్‌మెంట్ ఎంత ఉందో అతనికి పూర్తిగా తెలియకపోవచ్చు. కానీ చిరునవ్వులు చిందిస్తూ స్టేజ్ మీద గిఫ్ట్ అందుకుంటున్న దీక్షిత్ నా గురించి ఏ మాత్రం ప్రస్తావించలేదు. సరిగ్గా నన్ను ఎలివేట్ చేస్తే నా పేరు సీఈఓ దాకా వెళ్లేది."

"ఈ నయవంచనలు మన ఫీల్డ్‌లో మామూలేగా? ప్యూర్ (పూర్) ఇండియన్ మెంటాలిటీ."

"రేప్పొద్దున ఇయర్లీ అప్రయిజల్‌లో నేను ఫస్ట్ ప్లేస్‌లో ఉండొచ్చు. సాలరీ హైక్ బాగా ఉండొచ్చు. కానీ నాకందులో ఆనందం లేదు. చాలా మంది తమ పే-స్లిప్ చూసుకుని గర్విస్తారు. ఎ.టి.ఎమ్.లో కోరుకున్నంత డబ్బు డ్రా చెయ్యగలిగిన తమ కార్డ్‌ని చూసి గర్విస్తారు. అయామ్ నాట్ సచ్ టైప్ ఆఫ్ క్రీచర్. ఐ లవ్ మై వర్క్. ఐ టోటల్లీ ఇన్వాల్వ్ ఇన్ ఇట్. నేనే పని చేసినా అందులో ఆనందం పొందాలి. నా పని నేను ఆస్వాదించాలి. కాని అదే లభించటం లేదు. తను దున్నిన పొలాన్ని చూసి రైతు సంతోషిస్తాడు. చెప్పులు కుట్టే మనిషి తన పని చూసుకొని తృప్తి

చెందుతాడు. ఒక టీచర్, ఒక సైంటిస్ట్ తమ పనిలో లీనమై ఆనందిస్తారు. కాని మనం? మన పని విలువ, తృప్తి మనకు చెందకుండా పోవటమే బాధాకరం."

"కాని అందరూ నీలాగా ఆలోచిస్తున్నారంటావా?"

" కాకపోవచ్చు. ఎట్ లీస్ట్, ఐ ఫీల్ ఎలీనేటెడ్."

"ఐ థింక్ వి యార్ ఆల్ ఎలీనేటెడ్ బీయింగ్స్. వర్క్‌లో ఇన్వాల్వ్ కాకుండా నేనొక రకం. ఇన్వాల్వ్ అయ్యి నువ్వొక రకం."

"అవును. నువ్వు చేసేదేదీ నీది కాదు. క్యూబికల్‌లో కూర్చుంటే ఒక్కోసారి ఏదో శూన్యంలో ఆస్ట్రోనాట్ కూర్చున్నట్టు అన్పిస్తుంది. ఎ త్రీ డైమన్షనల్ వరల్డ్. అత్యాధునిక మాయా మాంత్రిక గుహ. మనం అందులో ఉన్నట్టే ఉంటుంది. కానీ ఉండం. ఇది వాస్తవంలో అవాస్తవం. ప్రాజెక్టుల తుది మొదలు మనకు తెలీవు. అవి ఎక్కడో ఎందుకో సరైన అవగాహన ఉండదు. నీకో వర్క్ ఎలాట్ అవుతుంది. అది నీకిష్టమా? కాదా? చెయ్యగలవా? లేదా? ఇవన్నీ అనవసరం కంపెనీకి. వాళ్లొక డెడ్ లైన్ పెడతారు. యు హావ్ టు వర్క్ బాక్‌వర్డ్స్. క్లయింట్స్ అడిగే అడ్డమైన ప్రశ్నలకి జవాబు చెప్పాలి. డెమో మీద డెమో లివ్వాలి. అప్ లోడ్స్. డౌన్ లోడ్స్. ఎక్కడా డిలీట్ చెయ్యలేని, విరామం లేని భారం. ఎంత ఒత్తిడి అయినా సహించు. నిద్రాహారాలు పక్కన బెట్టు. ఓకే. కాని పనిలో స్వేచ్ఛ సంగతి, తృప్తి సంగతి ఎవరికి పట్టింది?"

"టేకిట్ ఈజీ యార్! నెల తిరిగేసరికి మన ఫిఫ్టీ థౌజండ్ మనకొస్తుంది. లెటజ్ ఎంజాయ్."

"కానీ మనం ఎంజాయ్ చేస్తున్నది కలిగివున్నతనాన్ని."

"అంటే?"

"మనది హావింగ్ మోడ్ ఆఫ్ లైఫ్ అంటాడు ఎరిక్ ఫ్రామ్. బీయింగ్ మోడ్ ఆఫ్ లైఫ్ కానే కాదు."

"మధ్యలో ఈయనెవరే తల్లీ?"

"ఒక సోషల్ సైకాలజిస్ట్. ఆధునిక సమాజాన్ని లోతుగా అధ్యయనం చేశాడు."

"ఏంటో నీ మాటలు నన్ను భయపెడుతున్నాయే."

"విను మరి. లోకం దృష్టిలో మనకి గొప్ప ఉద్యోగాలున్నాయి. జనం అసూయపడే జీతాలున్నాయి. అవి కలిగి వున్నందుకు గర్విస్తున్నాం. కాని ఒక్క ఔటింగ్‌లో మనం కర్చు పెట్టే డబ్బుతో పదిమంది పేద విద్యార్థుల్ని చదివించవచ్చు. నా మొదటి జీతం అట్లాగే చేశాను. మరి అసలైన ఆనందం ఎందులో ఉందంటావు? కాని ఇక్కడ వాళ్ల ఆశలు, ఆలోచనలు వేరుగా వుంటున్నాయి. నిజంగా అస్వాదించాల్సింది మనం జీవించే క్షణాల్ని గదా?"

"మే బి - యస్. కానీ నాకా లోతులు తెలీవు. రేప్పొద్దున నా మొగుళ్లు - అదే యు.ఎస్. నుంచి మా క్లయింట్స్ - దిగుతున్నారు. టీమంతా తల్లకిందులవుతుంది. వాళ్లనెలా మేనేజ్ చెయ్యాలో, ఏమిటో అని ఒక వైపు భయం. పైగా టీమ్ లీడ్ కావటాన కూడా ఇంకా తలనొప్పి. అయినా మనకి కొత్తేముందిలే? ఎప్పుడూ ఉన్న తంతేగా?"

"కానీ ఎప్పుడూ కొత్త టెన్షనే గదా? నాకైతే ఎక్కువ కాలం ఈ ఉద్యోగం చెయ్యలేనేమో నన్పిస్తుంది ఈ మధ్య."

"తొందర్లో ఆన్ సైట్ పంపిస్తామంటున్నారు. అలా అన్నా కాస్త గాలిమార్పు ఉంటుందేమో? ఈ టెన్షన్స్ ఇలానే వుంటే, పెళ్లి సంగతి పక్కనబెట్టు, ముప్పై యేళ్లకే ముసలితనం రావటం ఖాయం."

"పోన్లే. ఇప్పటికీ సంగతి వదిలేద్దాం. చూడు, ఈ ప్రశాంత వాతావరణం. వీధులన్నీ నిద్రపోతున్నాయి. మెరుపులారిపొయ్యాయి. మబ్బులు కమ్ముకొని చుక్కలే కనపట్టం లేదు. సన్నసన్నగా తుప్పర. చీకటి వాన."

"సుప్రియా! ఈ చీకటి ఎంత మోహంగా ఉంది? రియల్లీ ఎ మిస్టిక్ గ్లూమ్, ఇన్ అండ్ అవుట్. ఈ చిరుచినుకుల మధ్య ఒక్కసారి నీ గొంతు విప్పరాదా? పాప్ మ్యూజిక్ వినీ వినీ విసుగెత్తింది. మరీ త్యాగరాజ కీర్తనలు వద్దులే తల్లీ!"

"సరే. ఎంకి పాటొకటి పాడతా, విను.

*'ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా!*
*ఎన్నెలల సొగసంత యేటిపాలేనటర?....*
*యెలుతురంతా మేసి*
*యేరు నెమరేసింది*
*కలవరపు నా బతుకు*
*కలత నిదరయ్యింది*
*ఈ రేయి....'*